క్లుప్తంగా

ఘనంగా పోచమ్మ బోనాలు



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పులతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు.

ఎల్లమ్మ తల్లికి..



ఎల్లమ్మ ఆలయంలో మహిళల పూజలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం చిన్నకోడూరులో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఎల్లమ్మ ఆలయానికి మహిళలు బోనాలతో ఊరేగింపుగా చేరుకుని పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురియాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రాంచంద్రపూర్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న మంద ధర్మయ్య

కోహెడరూరల్(హుస్నాబాద్): పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. ఆదివారం మండలంలోని వింజపల్లి, రాంచంద్రపూర్, వరికోల్ గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శెట్టి సుధాకర్, బోయిని జయరాజ్, జగన్‌రెడ్డి, వెంకట్‌స్వామి, బందెలా బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో శనివారం సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 52 మంది వాహనదారులపై కేసు నమోదు చేశారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై 343 కాంటాక్ట్, 592 నాన్ కాంటాక్ట్ కేసులు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. 111 వాహనాలపై ఉన్న పెండింగ్ ఈ చలాన్‌లను సంబంధిత వాహనదారులతో కట్టించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తరచూ ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. తనిఖీల్లో వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఇసుక వేలం ఎప్పుడు?

చిన్నకోడూరు(సిద్దిపేట): అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న రెండు లారీల ఇసుకను పోలీసులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఆ ఇసుకను చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద డంప్ చేశారు. ఎనిమిది నెలలుగా ఇసుక డంప్ ఉండటంతో కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు, సిబ్బందికి ఇబ్బందిగా మారింది. పట్టుకున్న ఇసుకను వెంటనే వేలం వేయాల్సి ఉన్నా వేయకపోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ జయలక్ష్మిని వివరణ కోరగా ఇసుక వేలం పాటకు ఆర్డీఓ కార్యాలయానికి అనుమతి కోసం పంపామని, అక్కడే ఆలస్యం జరిగిందని అనుమతి రాగానే వేలం పాట నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ హౌసింగ్ బోర్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నాయకం నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, ప్రియదర్శిని కాలనీ, టీచర్స్ కాలనీలో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పడకేసిన ప్రత్యేక పాలన

- చెత్తాచెదారం నిండిన మురుగు కాల్వలు
- దోమకాటుతో గ్రామస్తులు విలవిల
- పారిశుద్ధ్య నిర్వహణ పట్టని అధికారులు
- చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్

ప్రస్తుతం పల్లెల్లో అపరిశుభ్రం తాండవిస్తోంది. ప్రత్యేక పాలన అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో గ్రామాల్లో చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోతున్నాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోగాలబారిన పడ్డ జనం ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన పడకేసింది.



మిరుదొడ్డిలో చెత్తాచెదారంతో నిండిన మురుగు కాల్వ

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, అక్బర్‌పేట గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన అధికారుల పర్యవేక్షణ కరువైంది. పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పింది. అడపాదడపా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే మురుగు కాలువలు నిండిపోయి రోడ్లపై మురుగు పారుతోందని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని మండిపడుతున్నారు.

దోమలు, ఈగల బెడద

ఇళ్ల మధ్య చెత్తాచెదారం పేరుకుపోతుండటంతో దోమలు, ఈగల బెడదతో జనం అల్లాడుతున్నారు. చెత్తకుప్పలు, దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు, మురుగు దోమలకు ఆవాసంగా మారాయి. దోమకాటుతో వ్యాధుల బారినపడి ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికే అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో రెండు డెంగీ కేసులు నమోదు కావడం గమనార్హం.

చేతులెత్తేసిన అధికారులు

అభివృద్ధి పనులు చేపట్టేందుకు, నిర్వహణకు గ్రామ పంచాయతీలకు నిధులు లేక ప్రత్యేక పాలనాధికారులు చేతులెత్తేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కనీసం పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు పనిచేయడానికి ముందుకు రావడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

దోమలతో ఇబ్బంది పడుతున్నాం



నెలల తరబడి మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు. దోమ కాటుతో వ్యాధుల బారినపడి ఆసుపత్రుల్లో చేరాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– ఎండీ హస్సేన్, మిరుదొడ్డి

చర్యలు తీసుకుంటాం



గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా దృష్టి సారించాం. ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించాం. అన్ని గ్రామాల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయిస్తాం. కాల్వల్లో దోమల మందు పిచికారీకి చర్యలు తీసుకుంటాం.

– గంగుల గణేష్‌రెడ్డి, ఎంపీడీఓ, మిరుదొడ్డి



జప్తిలింగారెడ్డిపల్లిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రైతులను ఆదుకోవాలి

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ప్రాజెక్టులను నింపి రైతులు కరువు బారిన పడకుండా కాపాడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సురక్షితమైన నీటిని తాగాలన్నారు. తాగునీరు కలుషితమైతే అనేక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలుచెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు రూ.4 వేల పెన్షన్ వెంటనే అందించాలని కోరారు. కేసీఆర్ మీద కక్ష గట్టి కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి చెరువులు, కుంటలు, కూడవెల్లి వాగులోకి నీటిని వదలాలని కోరామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులకు వాటర్ క్యాన్లు, తడిపొడి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల పిడుగుపడి మరణించిన కడారి శ్రీశైలం కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి, మాజీ ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ బక్క కనకయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహులు, అశోక్, సరేందర్‌గౌడ్, రాములు, కొండల్‌రెడ్డి, రాజిరెడ్డి, పులిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండపోచమ్మకు భక్తుల తాకిడి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని శ్రీ కొండపోచమ్మ ఆలయాన్ని ఆదివారం రాజ్యసభ్య సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ దర్శించారు. ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు తెలిపారు. సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కొండపోచమ్మను దర్శించుకుని పూజలు చేస్తున్న బండారు శ్రీకాంత్‌రావు

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, మహేందర్‌రెడ్డి, భానుప్రకాష్‌రావు, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.



మజీద్‌పల్లిలో బోనాల ఊరేగింపు

బోనమెత్తిన మజీద్‌పల్లి

వర్గల్(గజ్వేల్): మజీద్‌పల్లి బోనమెత్తింది. బోనాలతో ఊరేగింపుగా అమ్మోరు గుడికి చేరుకుంది. వర్గల్ మండలం మజీద్‌పల్లిలో ఆషాఢ మాసం ఆదివారం పోచమ్మ దేవత బోనాల పండగ ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన బోనం కుండలతో, సంప్రదాయ వస్త్రధారణతో మహిళలు ఊరేగింపుగా ముందుకుసాగారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల హోరు, జలపందిరి మధ్య గ్రామ వీధుల గుండా పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తి శ్రద్ధలతో అమ్మోరుకు బోనం నైవేద్యంగా సమర్పించారు. సకల శుభాలు చేకూర్చాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల వేడుకకు బంధుగణం తరలిరాగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

బెజ్జంకిలో ..

బెజ్జంకి(సిద్దిపేట): యాదవ, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో బెజ్జంకిలో వేర్వేరుగా పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు పోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యాదవ, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



బెజ్జంకిలో బోనాలతో పోచమ్మ ఆలయానికి వెలుతున్న యాదవ సంఘం మహిళలు



సిద్దిపేటలో పోతురాజుల విన్యాసాలు

మహా మైసమ్మకు బోనాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆషాఢ మాసం బోనాల పండగ సందర్భంగా సిద్దిపేటలోని ప్రశాంత్ నగర్ శ్రీ మహామైసమ్మ దేవాలయం వద్ద ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బెల్లం నైవేద్యంగా అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. ఆలయానికి భక్తులు దప్పు చప్పుళ్లతో వచ్చారు. ఊరేగింపులో పోతరాజు గావు పట్టే సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది.

ఘనంగా మహంకాళి బోనాల ఉత్సవాలు



అమ్మవారికి బోనాలను సమర్పించేందుకు తీసుకువస్తున్న భక్తులు

గజ్వేల్‌రూరల్: ఆషాఢ మాసంలో నిర్వహించే మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహంకాళి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని మహిళలు బోనాలతో దేవాలయం వరకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. తొట్టెల ఊరేగింపు నిర్వహించారు.

భూదాన్ భూములను ప్రభుత్వానికి అప్పగించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): అధికార పార్టీ నాయకుడు ఆక్రమించిన భూదాన్, సీలింగ్ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీపీఎం పార్టీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. పట్టణ కేంద్రంతో పాటు చేర్యాల ప్రాంతంలోని భూదాన్, సీలింగ్ భూములను కబ్జా చేసిన అధికార పార్టీ నాయకుడు వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో పాల్గొన్నారు.

డీఎస్పీ మహాసభను జయప్రదం చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ధర్మ సమాజ్ పార్టీ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 22వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే మొదటి ప్లీనరీ మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు మహారాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 93 శాతం ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ, అగ్రకుల పేదల తరపున ధర్మ సమాజ్ పార్టీ రాజకీయ యుద్ధం చేస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు బీసీ, ఎస్టీ, ఎస్సీలను జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకే పరిమితం చేసి ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రిగా బీసీయేతరులే రాజ్యమేలుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు దీపక్ రాజ్, మండల నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

వంతెన నిర్మాణానికి గ్రామస్తుల వినతి

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి నుంచి శనిగరం గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న పిల్లి వాగుపై హైలెవల్ వంతెన లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో వాగు పొంగితే వంతెనపై రాకపోకలు నిలిచిపోతాయి. ఈ లోలెవల్ వంతెనను 40 ఏళ్ల క్రితం నిర్మించారు. వంతెన కుంగడంతో నాలుగేళ్లుగా వాగు పొంగిన ప్రతీ సారి మునుగుతోంది. ఈ సమయంలో వంతెన మీదుగా రాకపోకలు నిలిచిపోయి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. లోలెవల్ వంతెనకు అవతలి వైపున రాజీవ్ రహదారి, ఇటు మండల కేంద్రంతో పాటు రైతుల వ్యవసాయ భూములున్నాయి. హైలెవల్ వంతెన నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శనిగరం–తంగళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్నలోలెవల్ వంతెన

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వారంతా ఒకే పాఠశాలలో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు. ఎన్నో ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాలల్లో మొక్కలు నాటారు.



కొమురవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు



గోనెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-2001 బ్యాచ్ విద్యార్థులు



అప్పాదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ విద్యార్థులు



సింగాటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్ విద్యార్థులు



పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్ విద్యార్థులు



అప్పాదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2010-11 బ్యాచ్ విద్యార్థులు

సమావేశాన్ని జయప్రదం చేయాలి

కోహెడ(హుస్నాబాద్): అఖిల భారత యువజన సమాఖ్య హుస్నాబాద్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య మండల నాయకులు కందూకురి అంతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల జనరల్ బాడీ సమావేశం ఈ నెల 15న హుస్నాబాద్‌లో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రమేష్, వినయ్, సురేందర్, ఆనంద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **స్నేహితుడి కుటుంబానికి చేయూత**

దుబ్బాక: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మిత్రుడి కుటుంబానికి తోటి మిత్రులు చేయూత అందించారు. దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామానికి చెందిన చెత్రి కనకయ్య ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహితులు ఆదివారం మిత్రుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో కొండి రాజిరెడ్డి, యాదగిరి, పరమేశ్వర్, యాదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

◆ **ప్రమాద బీమా చెక్కుల పంపిణీ**



సిద్దిపేటజోన్: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటూ కాపాడుకుంటామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 54 మందికి చెక్కులు ఇచ్చినట్లు తెలిపారు.

◆ **మొక్కలు నాటిన వారికి బహుమతులు**

హుస్నాబాద్‌రూరల్: పల్లెలు పచ్చదనంతో ఉండాలంటే ప్రతీ ఇంట్లో మొక్కలు నాటాలని పందిల్లలోని 5జీ టౌన్ షిప్ ప్రతినిధి అయిలేని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వారం రోజులుగా మొక్కలు నాటిన వారికి ఆదివారం బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒకరు కృషి చేయాలన్నారు. గ్రామస్తులకు కావల్సిన మొక్కలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు అజేయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **శతకోటి హరేరామ నామ జపం**

మర్కుక్(గజ్వేల్): హరేరామ నామస్మరణతో పాండురంగ ఆశ్రమం మారుమోగుతోంది. 93వ ఆషాడి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శతకోటి హరేరామ నామజప యజ్ఞం నిర్వహించారు. 65 గ్రామాలకు చెందిన భగవత్ సేవా సమాజం భక్తులు శోభాయాత్రలతో పాండురంగాశ్రమానికి చేరుకున్నారు.